సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 14 । సెప్టెంబర్ । 2024



నేతలకు మేత..కూలీలకు వెత

టీడీపీ వర్గీయుల ఆర్థిక ప్రయోజనాల కోసం ఉపాధి హామీ కూలీల పని దినాలపై కూటమి ప్రభుత్వం కత్తి కట్టింది. యంత్రాలతో నిర్వహించే పనులకు ప్రాధాన్యత కల్పిస్తున్నారు. -8లో



ఏకదంతుడి లడ్డూకు భలే డిమాండ్

లంబోదరుడి లడ్డూకు భలే డిమాండ్ లభిస్తోంది. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజైన శుక్రవారం పలు ప్రాంతాల్లో వేలం పాట నిర్వహించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.360	రూ.400
రెండోరకం	రూ.240	రూ.356

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 94 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	590	590
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 76.680 కిలోలు

న్యూస్‌రీల్

వెలిగల్లు కుడికాలువ నీరు నిలుపుదల

గాలివీడు: వెలిగల్లు జలాశయంలో నీటి నిల్వలు తగ్గిన దృష్ట్యా కుడికాలువ నీటిని నిలుపుదల చేస్తున్నట్లు వెలిగల్లు ప్రాజక్టు డీఈఈ శిరీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గాలివీడు, రాయచోటి మండలాలకు విధిగా శుద్ధి చేసిన జలం అందించాల్సి ఉందని, అందువల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నీటి నిల్వలు పెరిగిన అనంతరం వ్యవసాయ అవసరాలకు అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక


చెంగల్‌రెడ్డి


ఉమాకాంత్

కడప ఎడ్యుకేషన్: ఏపీటీఎఫ్ అమరావతి అన్నమయ్య జిల్లాశాఖ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. కడప ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సీపీ ప్రసాద్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా చెంగలరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఉమాకాంత్, అసోసియేట్ అధ్యక్షుడిగా దాస్ , ఉపాధ్యక్షుడిగా శివరామకృష్ణ ,రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీగా రాధాకృష్ణ తోపాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.

15న ఘూటింగ్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక


మదనపల్లె సిటీ: జిల్లా జూనియర్ బాల,బాలికల ఘూటింగ్‌బాల్ జట్టును ఈనెల 15వతేదీన ఎంపిక చేయనున్నట్లు ఘూటింగ్‌బాల్ జిల్లా కార్యదర్శి గౌతమి తెలిపారు. మదనపల్లె సమీపంలోని వశిష్ట స్కూల్‌లో ఉదయం 9 గంటలకు ఎంపికలు జరగుతాయన్నారు. క్రీడాకారులు తమ వెంట ఆధార్, జనన ధ్రువీకరణ, రెండు ఫొటోలు తీసుకురావాలన్నారు. క్రీడాకారులు 1.4.2005 తరువాత పుట్టిన వారై ఉండాలన్నారు. వివరాలకు 6281881022 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం


రాయచోటి సమీపంలో సాగులో ఉన్న ప్రకృతి వ్యవసాయ పంటను పరిశీలిస్తున్న అధికారులు

రాయచోటి: ప్రకృతి వ్యవసాయంతో మంచి ఆరోగ్యంతోపాటు లాభాలను గడించవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్ అన్నారు. శుక్రవారం జిల్లా వ్యవసాయ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై జిల్లాలోని వ్యవసాయశాఖ అధికారులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ అనంతరం అధికారులతో కలిసి క్షేత్ర పరిశీలన చేశారు. డీపీఎంఎస్ వి, ప్రవీణ్ కుమార్ మండల వ్యవసాయాధికారులకు శిక్షణ ఇచ్చారు. వివిధ రకాల ద్రావణాలు, ఘన, ద్రవ, జీవామృతాలు తయారు చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు, మండల వ్యవసాయ అధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గండికోట నుంచి మైలవరానికి నీరు విడుదల


గండికోట నుంచి మైలవరం జలాశయానికి విడుదల చేసిన నీరు

కొండాపురం: గండికోట జలాశయం నుంచి మైలవరం జలాశయానికి 2500 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు జలవరులశాఖ డీఈ ఉమ మహేశ్వర్లు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తాగు నీటి అవసరాల కోసం గండికోటనుంచి మైలవరం జలాశయానికి అక్కడ నుంచి పెన్నానదిలో కృష్ణజలాలు వెళ్తున్నాయన్నారు. గండికోట జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 25.1 టిఎంసీల నీటి మట్టం నిల్వ ఉందన్నారు.గండికోట ఎత్తిపోతలపథకం నుంచి మూడు మోటర్లతో 1500 క్యూసెక్కుల నీటిని చిత్రవతి బ్యాలన్స్ రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తున్నామన్నారు. అలాగే జీకే ఎల్‌ఐ-1 నుంచి ఏడు మోటర్లతో పైడిపాలెం జలాశయానికి 770 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నామన్నారు. గాలేరినగరి సృజల స్రవంతి ప్రధాన కాలువ శెట్టివారిపల్లె హెడ్ రెగ్యూలేటర్ ద్వారా సర్వరాయసాగర్, వామికొండజలాశయాలకు 700 క్యూసెక్కులనీరు వెళుతోందని వివరించారు.

పేదలంటే బాబుకు నచ్చదు



పేదలన్న, వారి పిల్లలకు ఉన్నత చదువులను అందించాలన్నా ముఖ్యమంత్రి చంద్రబాబుకు నచ్చదు. దేవుడు వరమిచ్చినా పూజారి కనికరించడం లేదన్న విధంగా రాష్ట్రంలో నూతన మెడికల్ కళాశాల అనుమతి పరిస్థితులు ఉన్నాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రంలో అనేక మెడికల్ కళాశాలలు నిర్మించారు. వాటికి అనుమతులతో పాటు విద్యార్థుల సీట్ల కేటాయింపు చేస్తామని కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చినా కూటమి ప్రభుత్వం స్పందించడం లేదు. వైద్య విద్యను ప్రైవేట్‌పరం చేయాలన్న సంకల్పంతోనే కేంద్ర ప్రభుత్వం ఇస్తానన్న అనుమతులను తీసుకోవడం లేదు. ఇలాంటి ప్రభుత్వానికి ప్రజలు తప్పక బుద్ధి చెబుతారు. – రమేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, రాయచోటి



ఇది సరికాదు



ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో సీట్లపై వివక్ష చూపించడం సరికాదు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాల్లో సీట్లు వస్తాయని ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. ప్రస్తుతం సీట్లు రద్దు చేస్తారని చెబుతుంటే భయంగా ఉంది. చిన్నతనం నుంచి డాక్టర్ అవ్వాలన్నది కోరిక. ఇందుకోసం కష్టపడి చదువుతున్నా. పేద, మధ్య తరగతికి చెందిన నా లాంటి విద్యార్థులకు అన్యాయం జరిగే విధంగా సీట్లు రద్దు చేయడం అన్యాయం. ఒకవైపు ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు మెడికల్ సీట్లు, మెడికల్ కాలేజీలు కావాలని పోటీ పడుతుంటే మన ప్రభుత్వం సీట్లు వద్దని వెనక్కి పంపడం దారుణం. -హెచ్. శ్రావ్య, నీట్ విద్యార్థిని, భాకరాపేట, సిద్దవటం మండలం


చెరువులు నిండాలి..చేను పండాలి

- చుక్కనీరు లేక వట్టిపోయిన 1500 చెరువులు
- అడుగంటి పోతున్న రిజర్వాయర్లు
- తాగునీటికోసం తప్పని తిప్పలు

రాయచోటి: తీవ్ర వర్షాభావం కారణంగా అడుగంటుతున్న రిజర్వాయర్లు, వట్టిపోయిన చెరువులు, కుంటలతో దర్శనమిస్తూ అన్నమయ్య జిల్లా కరువు కోరల్లో చిక్కుకుంది. ఏడాది క్రితం వరకు జలసిరులతో సవ్వడి చేసిన రిజర్వాయర్లు, చెరువుల్లో నీరు క్రమంగా కనుమరుగైంది. వీటి కింద పచ్చని పంటలతో కనిపించిన భూములు ప్రస్తుతం కరువుతో అల్లాడిపోతున్నవి. సాగునీరు లేక నెర్రలు బారిన నేలను కృష్ణా జలాలతో అభిషేకిస్తామని ఇచ్చిన రాజకీయ నాయకుల హామీలు ఇంకా కార్యరూపం దాల్చలేదు. జిల్లాలో నిర్మించిన రిజర్వాయర్లలో ఉన్న నీరు కాస్త అడుగంటి పోతోంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో వరదలతో జనం అతలాకుతలం కాగా అన్నమయ్య జిల్లాలో మాత్రం వరుణ దేవుడి కటాక్షం కోసం ఎదురు చూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 7 రిజర్వాయర్లు, 3089 మైనర్ ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి. వాటిల్లో నీటి నిల్వలు లేకుండా బీడు భూములను తలపిస్తున్నాయి.

లోటు వర్షపాతం..

ఈ ఏడు జిల్లాలో వర్షపాతం లోటు వెంటాడుతోంది. సగటున కురవాల్సిన వర్షం కంటే తక్కువగా వర్షాలు కురిశాయి. 2021లో తుఫాన్ కారణంగా వచ్చిన వర్షాలు తరువాత చెప్పుకోదగ్గ స్థాయిలో కురవలేదు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు లోటువర్షపాతంగానే నమోదవుతూ వచ్చింది. జిల్లాలో సగటు వర్షపాతం 175.1 మిల్లీ మీటర్లు కురవాల్సి ఉండగా 160.6 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. జూలైలో 90.5 మిల్లీ మీటర్లు కురవాల్సి ఉండగా 47.5 మిల్లీ మీటర్లు మాత్రమే కురిసింది. ఆగస్టు నెలలో జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురిసింది. ప్రస్తుతం ఆకాశంలో మబ్బులు పట్టడం, చిరుజల్లులు కురవడం మినహా చెప్పుకోదగ్గ వానలు పడలేదు, వాగులు సాగలేదు. ఫలితంగా కుంటలు చెరువులోకి చుక్కనీరు చేరలేదు.


శ్రీనివాసపురం నాగిరెడ్డి జలాశయంలో మడుగుల్లో కనిపిస్తున్న నీరు

జిల్లాలో ఉన్న రిజర్వాయర్లు: **7**

రిజర్వాయర్ల సామర్థ్యం: **8** టీఎంసీలు

ప్రస్తుతం రిజర్వాయర్ల నీటి నిల్వ: **3.5** టీఎంసీలు

జిల్లాలో మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు: **3089**

ట్యాంకుల సామర్థ్యం: **14.28** టీఎంసీలు

ప్రస్తుతం నీటి నిల్వ: **3.2** టీఎంసీలు

వెలుగల్లు ప్రాజెక్టు..

గాలివీడు మండలంలోని పాపాఘ్ని నదిపై 4.64 టీఎంసీల సామర్థ్యంతో ఈ ప్రాజెక్టు దివంగత నేత వైఎస్సార్ హయాంలో నిర్మించారు. ప్రస్తుతం 2.42 టీఎంసీల నిల్వ మాత్రమే ఉంది. ఈ ప్రాజెక్టు నుంచి కాలువల ద్వారా గాలివీడు, లక్కిరెడ్డిపల్లి మండలాల్లోని చెరువులకు నీటిని నింపుతున్నారు. తద్వారా ఆ ప్రాంతాలలోని చెరువులలో జలకళ కనిపిస్తోంది.

శ్రీనివాసపురం నాగిరెడ్డి జలాశయం..

చిన్నమండెం మండల పరిధిలో ఒక టీఎంసీ సామర్థ్యంతో నిర్మించిన శ్రీనివాసపురం నాగిరెడ్డి జలాశయం పూర్తిగా హంద్రీనీవా నీటితో నింపాలని నిర్మించారు. నిర్మాణం పూర్తి చేసి ఐదు సంవత్సరాలు కావాస్తున్నా 25 శాతానికి మించి ప్రాజెక్టులో ప్రస్తుతం నీరు నిల్వలేదు.

అప్పలాయమ్మ చెరువు: కురబలకోట మండల పరిధిలో ఉన్న అప్పలాయమ్మ చెరువును 3 టీఎంసీల సామర్థ్యంతో ముదివేటి రిజర్వాయర్‌గా నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వం మారడంతో ఆ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ప్రస్తుతం ఆ చెరువులో 25శాతం వరకు మాత్రమే నీరు నిల్వ ఉంది.

పెద్దేరు ప్రాజెక్టు: తంబళ్లపల్లి సమీపంలో నిర్మించిన రిజర్వాయర్ అర్ధ టీఎంసీ సామర్థ్యంతో నిర్మించారు. ప్రస్తుతం అక్కడ 0.24 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది.

అడవిపల్లి రిజర్వాయర్..

కేవీపల్లి మండల పరిధిలోని అడవిపల్లి వద్ద రిజర్వాయర్‌ను 1.45 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. అందులో 0.5 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టుకు నీటి ఆదరువు లేకపోవడంతో హంద్రీనీవా ద్వారా నీటిని అందించే ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

పింఛా ప్రాజెక్టు: సుండుపల్లి మండలంలోని పింఛా గ్రామ సమీపంలో 0.5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించగా 2021లో వచ్చిన వరదలకు ప్రాజెక్టు కట్ట కొట్టుకుపోయింది. తరువాత కట్ట నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నా తగినంత వర్షాలు లేక అడుగంటిన నీటితో జలాశయం కనిపిస్తోంది.

బహుదా ప్రాజెక్టు..

నిమ్మనపల్లి మండల పరిధిలోని బహుదానదిపై 0.5 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్‌ను నిర్మించారు. ప్రస్తుతం 0.2 టీఎంసీల నీరు మాత్రమే అక్కడ ఉంది. ఇలా ప్రాజెక్టులు, రిజర్వాయర్లలోని నీటిమట్టం రోజురోజుకు పడిపోతుండటంతో జిల్లా వ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది.

సగం చెరువు ఖాళీ..

జిల్లాలో ఉన్న 3089 మైనర్ ఇరిగేషన్ నీటి ట్యాంకులలో 50 శాతానికిపైగా (1500) చెరువులలో చుక్క నీరు లేక బోసిపోయి ఎడారి ప్రాంతాన్ని తలపిస్తున్నాయి. ఈ చెరువులు నిండితే 14.28 టీఎంసీల నీటి నిల్వలు జిల్లాలో ఉంటాయి. కానీ తీవ్ర వర్షాభావం కారణంగా 3.2 టీఎంసీల నీరు మాత్రమే అక్కడక్కడా చెరువులలో ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు.

30 గ్రామాల్లో ట్యాంకర్లతో తాగునీరు..

జిల్లాలో నెలకొన్న తీవ్ర వర్షాభావం కారణంగా భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటి పోతున్నాయి. ఫలితంగా పంటల సాగు దేవుడెరుగు గ్రామాలలో తాగునీటి సమస్య తాండవమాడుతోంది. ఇప్పటికే జిల్లాలోని 30 గ్రామాలలో తాగునీటి సమస్య నెలకొనడంతో ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. ఇదే పరిస్థితి మరికొద్ది రోజులు ఉంటే మరికొన్ని ప్రాంతాలకు ట్యాంకర్ల సాయంతో నీటిని అందించాల్సి వస్తుందని అధికారులు చెబుతున్నారు.

ఎడారిని తలపిస్తున్న చెరువులు

వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో జీఎన్ఎస్ఎస్ నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌ను కలుపుతూ చేపట్టిన ఎత్తిపోతల పథకం పనులు 75శాతం వరకు పూర్తి చేసుకున్నాయి. ప్రభుత్వం మార్పుతో ఆ ప్రాజెక్టు పనులు కాస్త నత్తనడకన సాగుతున్నాయి. ఈ ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి జిల్లాలోని వెలిగల్లు ప్రాజెక్టు నింపి అక్కడ నుంచి జిల్లాలోని మిగలిన రిజర్వాయర్లు, చెరువులను నింపాలన్న ప్రయత్నానికి బ్రేకులు పడ్డాయి. మూడేళ్ల క్రితం వెలిగల్లు జలాశయం నిండటంతో ప్రాజెక్టు పరిధిలోని చెరువులకు కాలువల ద్వారా నీటిని అందిస్తూ వస్తున్నారు. దీంతో దివంగత నేత వైఎస్సార్ పుణ్యాన కరువు ప్రాంతంగా పేరున్న గాలివీడు మండలం కాస్త పచ్చని పంటలతో కనిపిస్తోంది. మిగిలిన మండలాల్లో ఏడాది క్రితం వరకు సుభిక్షంగా ఉన్న మెట్ట ప్రాంతం నేడు దుర్భిక్షంగా మారింది. హంద్రీ నీవా జలాల రాక కానరాక ప్రాజెక్టులు, రిజర్వాయర్లు అడుగంటుతుండగా చెరువులు, చెక్ డ్యాములు బీడువారిపోతున్నాయి.

భారమైన సాగు..

తీవ్ర వర్షాభావం కారణంగా జిల్లాలో పంటల సాగు భారంగా మారింది. జిల్లాలో సాధారణంగా అన్ని పంటలు కలిపి ఖరీఫ్‌లో ఒక లక్ష ఎకరాలలో సాగు విస్తీర్ణం ఉండగా వర్షాలు లేక 15 శాతానికి మించి సాగుకు నోచుకోలేదు. జిల్లాలో సాధారణంగా వరి 10 వేల ఎకరాలలో సాగు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 4500 ఎకరాలలో మాత్రమే సాగులోకి వచ్చింది. అలాగే 43 వేల ఎకరాలలో వేరుశనగ సాగు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు పదివేల ఎకరాలకు మించి సాగుకు నోచుకోలేదని వ్యవసాయ అధికారుల సమాచారం. ఇలా మిగిలిన పంటల సాగు కూడా గణనీయంగా పడిపోయింది.

ఇసుక కష్టాలు ఇంతింత కాదయా!

- అస్తవ్యస్తంగా సరఫరా
- బుకింగ్ కోసం బారులు తీరుతున్న వినియోగదారులు


ఇసుక టోకెన్ కోసం బారులు తీరిన ప్రజలు


వరుస క్రమం కోసం వాగ్వివాదం

సాక్షి రాయచోటి/రాజంపేట టౌన్: జిల్లాలో ఇసుక నిల్వ కేంద్రాల ఏర్పాటు ఆలస్యం అవుతుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈనెల 6వ తేదీన రాజంపేట నియోజకవర్గం సుండుపల్లె సమీపంలోని బుడిగుంటపల్లె వద్ద ఇసుక నిల్వ కేంద్రాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి బుకింగ్ కేంద్రాల వద్ద క్యూ కనిపిస్తోంది. మరోవైపు జిల్లా సరిహద్దులో ఉన్న వారికి ఇక్కడి నుంచి ఇసుకను తీసుకెళ్లడం భారంగా మారుతోంది.

స్టాక్ పాయింట్లు లేక ఇక్కట్లు

రాయచోటితోపాటు మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె, రైల్వేకోడూరు నియోజకవర్గాలకు సంబంధించి ఇసుక స్టాక్ పాయింట్లు లేవు. జిల్లాలోని అన్ని ప్రాంతాల ప్రజలు కూడా నేరుగా బుడిగుంటపల్లెకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది. దీంతో దూర ప్రాంతాల నుంచి రావడం కష్టంగా మారుతోంది. అక్కడ కూడా నిరీక్షణ తప్పడం లేదు. మరో వైపు బుకింగ్ కౌంటర్ల వద్ద కూడా క్యూలు ఏర్పడుతున్నాయి. గతంలో వైఎస్సార్ సీపీ హయాంలో పలుచోట్ల రీచ్‌లతోపాటు ప్రత్యేకంగా నియోజకవర్గ పరిధిలో ఇసుక స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచడంతో సమస్య ఉత్పన్నమయ్యేది కాదు. రాజంపేట-రాయచోటి ప్రధాన రహదారిలో కూచివారిపల్లె, సానిపాయి వద్ద రెండుచోట్ల బుకింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి రశీదు తీసుకున్న అనంతరం స్టాక్ పాయింట్ వద్దకు వెళ్లి ఇసుక తెచ్చుకోవాల్సిన ఉంటుంది.

సరిహద్దు మండలాల ప్రజలకు తప్పని తిప్పలు

జిల్లాలో ఒకే ఒక్క ఇసుక స్టాకు పాయింట్ ఏర్పాటు చేయడంతో జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న మండలాల ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. పెద్దతిప్పసముద్రం (పీటీఎం), ములకలచెరువు, నిమ్మనపల్లె, కేవీ పల్లె, పీలేరు, పెనగలూరు, రైల్వేకోడూరు, సిద్దవటం తదితర ప్రాంతాల ప్రజలకు ఇసుకను తీసుకెళ్లడం గగనంగా మారింది. తంబళ్లపల్లె ప్రాంతంతోపాటు నందలూరు, రాజంపేట, పెనగలూరు తదితర ప్రాంతాల్లో సమీపంలోనే నదుల్లో ఇసుక లభ్యం అవుతున్నా ప్రస్తుతం నదుల్లోకి తెచ్చుకునేందుకు నిబంధనలు అడ్డుపడడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

పలుకుబడి కలిగిన వారికే ప్రాధాన్యత

జిల్లాలోని బుడుగుంటపల్లె సమీపంలో మూడు రీచ్‌ల ద్వారా 5.18 లక్షల టన్నుల ఇసుకను గుర్తించి అక్కడి నుంచి సమీపంలోనే స్టాక్ పాయింట్ పెట్టి టన్నుకు రూ. 323 చొప్పున రవాణా చార్జీలతో పంపిణీకి జిల్లా అధికారులు శ్రీకారం చుట్టారు. రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల వారికి కూచివారిపల్లె వద్ద బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేయగా, రాయచోటి, పీలేరు, తంబళ్లపల్లె ప్రాంతాల ప్రజలకు సానిపాయి వద్ద మరో బుకింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇదంతా ఒక ఎత్తయితే, స్టాక్ పాయింట్ వద్ద సామాన్యులకు కాకుండా కాంట్రాక్టర్లు, పచ్చనేతలు, పలుకుబడిన వారికి మాత్రమే ఇసుకను నేరుగా నింపి పంపిస్తున్నారు. దీంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని సామాన్య ప్రజలు వాపోతున్నారు.

రోజుకు 80 టోకెన్లు

రాజంపేట నియోజకవర్గంలోని రాజంపేట, నందలూరు, ఒంటిమిట్ట, సిద్దవటం, రైల్వేకోడూరులోని రైల్వేకోడూరు, పెనగలూరు, చిట్వేలి, ఓబులవారిపల్లె, పుల్లంపేట మండలాల వారికి ఆర్‌బుడుగుంటపల్లె రీచ్ నుంచి ఇసుకను సరఫరా చేస్తున్నారు. అయితే రోజుకు 40 ట్రాక్టర్లు, 40 టిప్పర్‌లకు మాత్రమే టోకెన్లు ఇస్తుండటంతో అందరికీ ఇసుక దొరకడం లేదు.

- ఇసుక కావాలంటే భవన యజమానులే టోకెన్ తెచ్చుకోవాల్సివుంది. టోకెన్ తెచ్చుకోలేని వారికి ట్రాక్టర్ యజమానులు ఐదువందల రూపాయలు ఇచ్చి తమ డ్రైవర్‌లను లేకుంటే ఇతరులను ఎవరినైనా క్యూలో ఉంచుతున్నారు.
- టోకెన్ తీసుకొని సాయంత్రం ఆరు గంటలలోపు రీచ్‌కు వెళ్లిన వారికే ఇసుకను లోడ్ చేస్తున్నారు. ట్రాక్టర్, టిప్పర్ నంబర్‌లను బిల్లుల్లో రాస్తుండటం వల్ల నంబర్ ఉన్నవి మాత్రమే రీచ్‌కు వెళ్లాలి. అయితే వాహనాలు చెడిపోయి బాగు చేసుకుని వెళ్లడం కాస్త ఆలస్యమైతే అధికారులు నిర్దాక్షిణంగా వెనక్కి పంపుతున్నారు. మరుసటి రోజు మళ్లీ మైనింగ్‌శాఖ అధికారులు అనుమతి ఇస్తేనే ఇసుక ఇస్తుండటంతో వాహన యజమానులకు ఇది తలకు మించిన భారం అవుతుంది.

ట్రాక్టర్ ఇసుక పట్టణానికి వచ్చేసరికి రూ.4,500పై మాటే


ఒక ట్రాక్టర్‌కు ఐదు టన్నుల మేర ఇసుక పడుతుండటంతో ప్రభుత్వానికి రూ. 1640 చెల్లించాల్సి వస్తోంది. రాజంపేట పట్టణం నుంచి ఆర్ బుడుగుంటపల్లె రీచ్ దాదాపు 30 కిలోమీటర్లకు పైగా ఉంది. ఇలా పట్టణం నుంచి ఇసుక రీచ్‌కు ఇసుక రీచ్ నుంచి పట్టణానికి రావాలంటే అరవై కిలోమీటర్లు ప్రయాణించాలి. దీంతో ట్రాక్టర్ యజమానులు మూడు వేల రూపాయిల వరకు బాడుగను వసూలు చేస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వానికి చెల్లించాల్సిన 1,640 రూపాయలతో పాటు ట్రాక్టర్ బాడుగను లెక్కకడితే ఒక ట్రాక్టర్ ఇసుక 4,640 అవుతుంది. కొన్ని గ్రామీణ ప్రాంతాలకు ట్రాక్టర్ ఇసుక చేరాలంటే రూ. 6 వేల నుంచి 7500 వరకు వెచ్చించాల్సి వస్తోందని భవన నిర్మాణ యజమానులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో రాజంపేట పట్టణానికి కేవలం 12 కిలోమీటర్ల దూరంలో ఉండే మందరం రీచ్ నుంచి ఇసుక సరఫరా అయ్యేది. దీంతో ట్రాక్టర్ ఇసుక పట్టణంలోని దూరాన్ని బట్టి మూడు వేల రూపాయల నుంచి మూడు వేల ఐదువందలకే దొరికేది. దూరాన్ని బట్టి గత ప్రభుత్వ హయాంలోకంటే కూటమి ప్రభుత్వంలో ట్రాక్టర్ ఇసుకకు వెయ్యి రూపాయల నుంచి పదిహేను వందల రూపాయిల వరకు అదనపు భారం పడుతుందని భవన నిర్మాణ యజమానులు చెబుతున్నారు.

తెల్లవారుజామున రెండు గంటలకు వచ్చా




ఇసుక కోసం తెల్లవారుజామున రెండు గంటలకు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్దకు వచ్చి కునుకు తీస్తూ కూర్చున్నా. ఇసుక కోసం ఇబ్బందులు పడాల్సి వస్తుంది. రెండుగంటలకు వచ్చి కూర్చుంటే నాకు మొదటి టోకెన్ వచ్చింది. -శివారెడ్డి, మంటపంపల్లె, ఒంటిమిట్ట మండలం

భగవంతుడిపై భారం వేసి కూర్చున్నా



మేము పేదోళ్లం. మా వారు బేల్దారి పనికిపోతాడు. చిన్న ఇల్లు కట్టుకుంటున్నాం. ఇసుక కావాలి. మా ఇంటాయన ఇసుక టోకెన్‌కు వస్తే పనికి పోలేడు. ఇకచేసేదేమి లేక నేనే వచ్చా. భగవంతుడిపై భారం వేసి 4-30 గంటలకు వచ్చి ఇక్కడ కూర్చున్నా. -రాణి, ఎన్‌టీఆర్ కాలనీ, రాజంపేట మండలం

నా బాధ ఎవరికి చెప్పుకోవాలి



ఈనెల 12న ఇసుక కోసం టోకెన్ తీసుకున్నాను. అయితే ట్రాక్టర్ చెడిపో వడంతో రిపేరు చేయించుకుని వెళ్లా. బిల్లు చూపించి నా పరిస్థితి చెప్పినా ఇసుక ఇవ్వలేదు. మళ్లీ అధికారులతో రాయించుకుని రమ్మన్నారు. నా బాధను ఎవరికి చెప్పుకోవాలి. -సన్నపునేని కార్తీక్, చుండువారిపల్లె, రాజంపేట మండలం

17 నుంచి 'స్వచ్ఛతా హీ సేవ'


స్వచ్ఛతా హీ సేవ ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తదితరులు

రాయచోటి: జిల్లాలో ఈనెల 17వ తేదీ నుంచి వచ్చేనెల ఒకటో తేదీ వరకు స్వచ్ఛతాహీ సేవ పేరుతో వివిధ కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి డివిజన్, మండలస్థాయి, మున్సిపల్, ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవి, డీఆర్ఓ సత్యనారాయణ రావు హాజరయ్యారు. అక్టోబర్ 2న స్వచ్ఛ భారత్ దివస్ నిర్వహించుకుంటున్న నేపథ్యంలో ఈనెల 17వ తేదీ నుంచి అన్ని మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజా ప్రతినిధులను, ప్రముఖులను భాగస్వాములను చేసి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛతా హీ సేవ ప్రచార పోస్టర్లను జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆవిష్కరించారు. సమావేశంలో డ్వామా, డీఆర్‌డీఏ, పంచాయతీ, జిల్లా పరిషత్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, డివిజన్ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పశువులకు టీకా వేయించాలి

నందలూరు: పశువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ గుణశేఖర్ పిళ్లై పేర్కొన్నారు. శుక్రవారం పొత్తపిలో ఆయన మాట్లాడుతూ కలుషిత తాగునీరు, దోమకాటు పాడి పశువుల్లో గొంతువాపు వ్యాధికి కారణమవుతోందని తెలిపారు. ఈ వ్యాధి సోకిన పశువులకు మిగతా జీవాలను దూరంగా ఉంచాలని సూచించారు. టీకా వేయిస్తే పాలు తక్కువ ఇస్తాయన్న అపోహలను యజమానులు విడనాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువ్యాధుల నిర్ధారణ అధికారి డాక్టర్ రాజశేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ప్రతాప్, పశు వైద్యాధికారిణి అశ్వనీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

మదనపల్లె : సెల్‌ఫోన్ చోరీ విషయమై జరిగిన ఘర్షణలో నిందితునిపై దాడి కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. మండలంలోని చీకలబైలు పంచాయతీ జోలపేటకు చెందిన వసంత్‌కు చెందిన సెల్‌ఫోన్ చోరీకి గురైంది. ఈ నెల 9వ తేదీ రాత్రి మద్యం సేవించిన వసంత్ సెల్‌ఫోన్ చోరీపై గ్రామస్తులను నిందిస్తూ అసభ్యకరంగా మాట్లాడాడు. స్థానికుడైన నిరంజన్ అతడిని ఎందుకు అందరిని తిడుతున్నావని ప్రశ్నించాడు. దీంతో వసంత్ నిరంజన్‌పై దాడి చేశాడు. వెంటనే నిరంజన్ తల్లిదండ్రులైన నారాయణ(57), విజయమ్మ(48) గొడవను అడ్డుకునేందుకు ప్రయత్నించగా, వసంత్ వారిపై కొడవలితో దాడి చేశాడు. గాయపడిన బాధితులను స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. నిరంజన్ ఫిర్యాదు మేరకు నిందితుడైన వసంత్‌పై దాడి కేసుతోపాటు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

'పశువులను తరలించిన లారీ మాది కాదు'

మదనపల్లె : మండలంలోని తట్టివారిపల్లె వద్ద అనంతపురం నుంచి తమిళనాడుకు పశువులను తరలిస్తున్నట్లు పత్రికల్లో ప్రచురితమైన లారీ ఫొటో తమదని, దానికి పశువుల తరలింపునకు ఎటువంటి సంబంధం లేదని విక్రమ్ రోడ్ లైన్స్ యాజమాన్యం తెలిపింది. శనివారం అమ్మచెరువుమిట్టలోని విక్రమ్ రోడ్‌లైన్స్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో... పశువుల తరలింపు వార్తలో తమ కంపెనీకి చెందిన లారీ ఫొటో ప్రచురితమైందని, ఆ ఘటనకు తమ లారీకి ఎలాంటి సంబంధం లేదని పేర్కొంది. తమ వాహనాల్లో పశువులను తరలించడం జరగదని వివరించింది.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

మదనపల్లె : అమ్మవారి ఆలయంలో తాళిబొట్టు చోరీ చేసిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. మండలంలోని వలసపల్లె పంచాయతీ మొలకలదిన్నెకు చెందిన హరీష్ అలియాస్ హరి(29), సాయిప్రతాప్ అలియాస్ ప్రతాప్(25) మద్యం తాగేందుకు డబ్బులు లేవని ఈనెల 10వ తేదీ రాత్రి స్థానికంగా ఉన్న అమ్మవారి ఆలయంలో చోరీకి పాల్పడ్డారు. అమ్మవారి మెడలోని 2.1 గ్రాముల బరువున్న బంగారు తాళిబొట్టును చోరీ చేశారు. ఈ విషయమై ఆలయ పూజారి శశికాంత్ తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు.

కోడిపందెం స్థావరంపై దాడి

గాలివీడు : మండల పరిధిలోని తలముడిపి, కొర్లకుంట గ్రామాల శివారులో కోడిపందెం స్థావరంపై ఎస్‌ఐ రామకృష్ణ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ సందర్భంగా 19 మందిని అరెస్ట్ చేసి, వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు. వారి నుంచి రూ. లక్షా ఐదు వేలు, రెండు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

దురుద్దేశంతోనే అడ్డుకున్నారు



వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థులకు వైద్య విద్య అందించాలనే ఉద్దేశంతో కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలను మంజూరు చేసింది. దీని వల్ల 1800 మెడికల్ సీట్లు అందుబాటులోకి వస్తాయి. అయితే ప్రభుత్వ రంగంలో మెడికల్ కాలేజీల నిర్మాణం ఉండకూడదని చంద్రబాబు ప్రభుత్వం భావించి, వీటిని ప్రైవేటు పరం చేసి పేద ప్రజలపై భారం మోపేందుకు ప్రయత్నిస్తోంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఫీజులు తక్కువగా ఉంటాయి. రాష్ట్రంలో నీట్ పరీక్ష రాసిన 5 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సీట్లు లభిస్తాయని ఎదురు చేస్తున్నారు.

– రమేష్ యాదవ్, ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు.



రూ.లక్షలు పెట్టి చదివించాలంటే భయమేస్తోంది



మధ్య తరగతి కుటుంబానికి చెందిన మేము లక్షల రూపాయలు ఖర్చు పెట్టి పిల్లలను వైద్య విద్య చదివించాలంటే భయమేస్తోంది. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన వైద్య కళాశాలలను చంద్రబాబు ప్రభుత్వం ప్రారంభించకపోవడం దారుణం. ఈ విషయంలో చంద్రబాబునాయుడు ఆలోచన సరైనది కాదు. వెంటనే నిర్ణయాన్ని విరమించుకుని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన వైద్య సీట్లను రాష్ట్రానికి కేటాయించుకొని కొత్త కళాశాలల ప్రారంభానికి సహకరించాలి. లేకపోతే మాలాంటి వారి పిల్లలకు పెద్ద చదువులు ప్రశ్నార్థకంగా మారుతాయి.

– అరుణ, బోస్‌నగర్, రాయచోటి పట్టణం

నేతలకు మేత.. కూలీలకు వెత

- టీడీపీ వర్గీయులకు 'ఉపాధి'
- కూటమిలో వర్గపోరుతో అధికారుల సతమతం
- యంత్రాలతో నిర్వహించే పనులకే అధిక ప్రాధాన్యం





సాక్షి టాస్క్‌ఫోర్స్ : జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా వంద రోజుల పని దినాలను కూలీలకు అందించాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. సాధారణంగా పనుల్లో అత్యధిక శాతం ఉపాధి కూలీలకు ఎక్కువ రోజులు పని దినాలు కల్పించేలా అధిక ప్రాధాన్యం ఇస్తుంటారు. చెరువుల్లో పూడికతీత, గట్ల నిర్మాణం, ఫీడర్ కాలువల తవ్వకాలు, వ్యవసాయ భూముల్లో ఫారంపాండ్స్, నీటి కందకాలు లాంటి పనులకు గతంలో ఎక్కువగా కేటాయించడంతో ఉపాధి హామీ కూలీలకు న్యాయం జరిగేది. అయితే ఇందుకు భిన్నంగా తాజాగా టీడీపీ వర్గీయుల ఆర్థిక ప్రయోజనాల కోసం ఉపాధి హామీ కూలీల పని దినాలపై కూటమి ప్రభుత్వం కత్తి కట్టింది. తంబళ్లపల్లి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఇటీవల గ్రామసభలను అధికారులు నామమాత్రంగా నిర్వహించారు. తెలుగు తమ్ముళ్లు లబ్ధి పొందేలా ఈసారి పూర్తిగా యంత్రాలను ఉపయోగించి నిర్మించే సిమెంటు రోడ్లు, మురికి కాలువలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారు. నియోజకవర్గంలోని సిమెంటు రోడ్ల మంజూరు కోసం టీడీపీ నేతల ఆదేశాలతో అధికారులు రూ.4 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధ చేశారు. పూర్తిగా యంత్రాల ద్వారా చేపట్టే ఇలాంటి పనుల ద్వారా ఉపాధి కూలీలకు నష్టం వాటిల్లనుంది.

తమ్ముళ్లకు సహకరించాలని సిబ్బందిపై ఉన్నతాధికారి ఒత్తిళ్లు

తంబళ్లపల్లి నియోజకవర్గంలోని టీడీపీలో నెలకొన్న వర్గపోరుతో అధికారులు సతమతమవుతున్నారు. టీడీపీలోనే నాలుగు గ్రూపులు ఏర్పడటంతో ఎవరికి సహకరించాలో.. ఎవరికి సహకరించకపోతే ఎలాంటి ఇబ్బందులు తలెత్తుతాయోనని అధికారులు ఆందోళనతో ఉన్నారు. ఇదిలా ఉండగా ఉపాధి హామీలో పని చేస్తున్న ఓ ఉన్నతాధికారి మాత్రం పనులు ఎలా చేసినా, చేయకపోయినా తెలుగు తమ్ముళ్లకే మీరంతా బిల్లులు పెట్టి సహకరించాలని మండల స్థాయిలో పని చేస్తున్న క్షేత్ర, సాంకేతిక సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. దీంతో తమ జీవితాలను పణంగా పెట్టి దొంగ బిల్లులు పెట్టే కన్నా.. సెలవులో లేదా బదిలీ అయి వెళ్లడం నయమని పలువురు ఎఫ్ఏ, టీఏలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే తామంతా గతంలో నాయకులు చేసిన రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఎవరో చేసిన తప్పులకు 15 ఏళ్లుగా కోర్టులు, లాయర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నామని వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రూ.4 కోట్లతో సిమెంటు రోడ్లకు ప్రతిపాదనలు

నియోజకవర్గంలోని ఆరు మండలాలకు కలిపి రూ.4 కోట్లతో సిమెంట్ల రోడ్ల మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందులో టీడీపీ నాయకుడు జయచంద్రారెడ్డి సొంత మండలానికే రూ.1.87 కోట్ల నిధులకు ప్రతిపాదనలు తయారు చేయడంపై కూటమిలోని మిగిలిన వర్గీయులు భగ్గుమంటున్నారు.

మండలాల వారీగా సిమెంటు రోడ్ల మంజూరుకు నిధుల వివరాలు

మండలం	పనుల సంఖ్య	సీసీ రోడ్లు (మీటర్లలో)	నిధులు (రూ.లలో)
ములకలచెరువు	59	4,710	1.87 కోట్లు
బి.కొత్తకోట	8	832	33 లక్షలు
కురబలకోట	15	1779	69 లక్షలు
పెద్దతిప్పసముద్రం	28	1586	63 లక్షలు
తంబళ్లపల్లి	9	900	32 లక్షలు
పెద్దమండ్యం	4	1300	16 లక్షలు

ఏకదంతుడి లడ్డూకు భలే డిమాండ్



లంబోదరుడి లడ్డూకు భలే డిమాండ్ లభిస్తోంది. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజైన శుక్రవారం పలు ప్రాంతాల్లో వేలం పాట నిర్వహించారు. ఇందులో భక్తులు పోటాపోటీగా పాల్గొన్నారు. రికార్డు ధరకు పాట పాడి, స్వామి వారి ప్రసాదం దక్కించుకున్నారు. తమకు లభించడం అదృష్టంగా భావిస్తున్నామని వారు తెలిపారు. ఇందులో భాగంగా ఒంటిమిట్ట మండల పరిధి మంటపంపల్లి పంచాయతీలోని మారయ్యగారిపల్లెలో వెంకటస్వామి దేవాలయం వద్ద వినాయకుడి లడ్డూ వేలంపాట నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన గడ్డం వెంకటశివారెడ్డి రూ.3 లక్షలకు దక్కించుకుని సంతోషం వ్యక్తం చేశాడు. – ఒంటిమిట్ట

కువైట్ కష్టాల నుంచి విముక్తి

- పిల్లల వినతిపై స్పందించిన ఎస్పీ
- స్వగ్రామానికి బయలుదేరిన బాధితురాలు



కవిత, భర్త, ముగ్గురు కుమార్తెలు (ఫైల్)

రాయచోటి : బతుకుదెరువు కోసం కువైట్ వెళ్లి చిత్రహింసలకు గురవుతున్న కవితకు కన్నబిడ్డల వేడుకతో పోలీసుల సాయంతో మోక్షం లభించింది. తల్లిపడుతున్న వేదనను భరించలేని ముగ్గురు కుమార్తెలు అందుబాటులో ఉన్న రాజకీయ నాయకులు, అధికారులను కలిసి వేడుకున్నారు. బిడ్డల వేడుకపై స్పందించిన అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు కువైట్‌లో ఇబ్బందులు పడుతున్న కవితను ఇండియాకు రప్పించేందుకు తనదైన శైలిలో ప్రయత్నాలు చేశారు. ఎస్పీ తన సిబ్బందితో చేసిన ప్రయత్నాలు ఫలించడంతో శనివారం కవిత ఇండియాకు వచ్చేందుకు మార్గం సుగమయింది. అన్నమయ్య జిల్లా సంబేపల్లి మండలం నారాయణ రెడ్డిపల్లి గ్రామానికి చెందిన కవిత తన ముగ్గురు కుమార్తెలను పోషించేందుకు రెండున్నర నెలల క్రిందట కువైట్ దేశానికి వెళ్లింది. భర్త వెంకటేశ్వర్లు కుటుంబ పోషణ కోసం కేరళ రాష్ట్రంలో జీవనం సాగిస్తున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో బిడ్డలను ముగ్గురిని ఇంటి వద్దనే వదిలి తనవంతుగా కుటుంబానికి అండగా నిలిచేందుకు గల్ఫ్ దేశం వెళ్లింది. ఏజెంట్ మోసపూరిత వీసా తీయడంతో గల్ఫ్ దేశంలో షేట్ చేతుల్లో చిత్ర హింసలకు గురైంది. కువైట్ వారు తనను కొట్టి చిత్రహింసలకు గురి చేస్తున్నారని కన్నీటి పర్యంతమై వీడియో ద్వారా బోరున విలపించింది. ఆ వీడియో సోషల్ మీడియాలో అందరి హృదయాలను కలిచివేసేలా వైరల్ అయ్యింది. అంతేకాకుండా ఆమె ముగ్గురు కుమార్తెలు స్వాతి, మహిథ, రమాదేవీలు జిల్లా ఎస్పీని కలిసి తల్లి పడుతున్న బాధను విన్నవించుకున్నారు. తీవ్ర కష్టాలలో ఉన్న మా తల్లిని రక్షించి మా ఇంటికి రప్పించేలా చూడాలని వేడుకున్నారు. దీంతో ఎస్పీ స్పందించి ఆమెను గల్ఫ్ దేశానికి పంపిన ఏజెంట్‌ను పిలిపించి జరిగిన సంఘటనపై ఆరా తీశారు. ఏజెంట్ ద్వారా గల్ఫ్ షేట్‌ను సంప్రదించి కష్టాలలో ఉన్న కవితను ఇండియాకు రప్పించేందుకు చర్యలు పూర్తి చేశారు. విమానయాన టికెట్టును కూడా కవితకు అందజేసినట్లు జిల్లా పోలీసు కార్యాలయం నుంచి సమాచారం అందింది. కన్నీటి పర్యంతంలో ఉన్న కవిత స్వగ్రామానికి బయలుదేరడంతో కుమార్తెలు ముగ్గురు ఆనందంతో జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. జిల్లా ఎస్పీ స్పందన పట్ల జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన విద్యార్థి మృతి



ధనరాజ్ (ఫైల్)

మదనపల్లె : ఆత్మహత్యాయత్నానికి పాల్పడి బెంగళూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి శుక్రవారం మృతి చెందాడు. తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె పంచాయతీ దిగువముత్రపల్లెకు చెందిన చలపతి, రెడ్డెమ్మల కుమారుడు ధనరాజ్(17) మదనపల్లెలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఐటీఐ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 9న గ్రామంలో వినాయక విగ్రహ నిమజ్జనోత్సవం జరుగుతుండగా, తల్లిదండ్రులు వెళ్లవద్దని వారించినా వెళ్లాడు. దీంతో ఇంటికి వచ్చిన ధనరాజ్‌ను తల్లిదండ్రులు మందలించారు. మనస్తాపం చెంది పదో తేదీ సాయంత్రం ధనరాజ్ పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచనల మేరకు బెంగళూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. తంబళ్లపల్లె పోలీసులు మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఇళ్ల నిర్మాణాల్లో నిర్లక్ష్యం తగదు

రాయచోటి : గృహ నిర్మాణాల లక్ష్య సాధనలో నిర్లక్ష్యం చూపితే చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ గృహ నిర్మాణ శాఖ అధికారులను హెచ్చరించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్ నుంచి డివిజన్, మండల స్థాయి గృహనిర్మాణశాఖ అధికారులు, ప్రత్యేక అధికారులతో జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గత 15 రోజులుగా గృహనిర్మాణ స్టేజ్ కన్వర్షన్‌లో 64 సచివాలయాల పరిధిలో జీరో శాతం ప్రగతి ఉందని, ప్రత్యేక చొరవతో వారం రోజులలో పూర్తిగా ఎక్కడ కూడా జీరో శాతం ప్రగతి ఉండకుండా లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఎంపీడీఓలు, మండల స్పెషల్ ఆఫీసర్లు, గృహనిర్మాణశాఖ అధికారులు, సిబ్బంది స్వయంగా కృషి చేయాలన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్లు మేఘ స్వరూప్, వైఖోమ్ నదియా దేవి, ఆర్డీఓ రంగస్వామి, హౌసింగ్ ప్రాజెక్టు అధికారి శివయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, గృహనిర్మాణశాఖ డివిజన్, మండలస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లు వద్దు



సహారా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిరసన

రాయచోటి టౌన్ : ముస్లింల ఆస్తులను కాజేసేందుకు వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతోందని వైఎస్సార్‌సీపీ నాయకుడు బేపారీ మహమ్మద్ ఖాన్ అన్నారు. వక్ఫ్ వసరణను వ్యతిరేకిస్తూ గత వారం రోజులుగా సహారా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో క్యూ ఆర్ కోడ్ ద్వారా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ సవరణకు వ్యతిరేకంగా జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ఫిర్యాదులు అందిస్తున్నామని చెప్పారు. వక్ఫ్‌లో ఎలాంటి సవరణ అవసరం లేదని, ఉన్నది ఉన్నట్లుగానే ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజూర్ రహిమాన్, కౌన్సిలర్లు అన్నా సలీం, ఫయాజ్ అహమ్మద్, షబ్బీర్ అహమ్మద్, జాకీర్, జబీవుల్లాఖాన్, పట్టణ అధ్యక్షులు రియాజు రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



శివమణి (ఫైల్)



మృతి చెందిన మార్కెండేయులు

కురబలకోట : జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. కురబలకోట మండలం అంగళ్లు సమీపంలోని కనసానివారిపల్లె వద్ద గురువారం రాత్రి బైక్ అదుపు తప్పి మదనపల్లె మండలం చిలకవారిపల్లె కాలనీకి చెందిన వెల్డర్ శివమణి (23) మృత్యువాత పడ్డాడు. గురువారం యథావిధిగా వెల్డర్ పనికి వెళ్లి రాత్రి మోటార్ సైకిల్‌పై ఇంటికి వెళుతుండగా ఎదురుగా వచ్చిన వాహనానికి సైడు ఇవ్వబోయి అదుపు తప్పి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయాలై మృతి చెందినట్లు ముదివేడు పోలీసులు తెలిపారు. పైగా సీటీఎం రోడ్డు మార్గంలో రెండు రోజులుగా ఓ టెలికమ్ సంస్థ కేబుల్ వేయడానికి జేసీబీలతో ట్రెంచ్ పనులు నిర్వహిస్తోంది. మట్టిని రోడ్డుపక్కన వేశారు. ఎదురుగా వచ్చే వాహనానికి సైడు ఇచ్చే క్రమంలో ఇతను అదుపు తప్పి పడిపోయి తీవ్రగాయాలై మృతి చెందినట్లు బాధిత కుటుంబీకులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఇతను ఒక్కడే కుమారుడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ శుక్రవారం తెలిపారు.

లారీ ఢీకొని..

పీలేరు రూరల్ : లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని తలపుల పంచాయతీ రాజువారిపల్లె వద్ద చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఎర్రావారిపాళెం మండలం ఓఎస్ గొల్లపల్లె పంచాయతీ బోయపల్లెకు చెందిన ఎ. మార్కెండేయులు (54) శుక్రవారం ఉదయం తన టీవీఎస్ ఎక్స్‌ఎల్ స్కూటర్‌లో పీలేరు మండలం తలపులకు వచ్చి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. అయితే మార్గంమధ్యలో యల్లమంద నుంచి విద్యుత్ స్తంభాలు తరలించే లారీ ఎదురుగా వచ్చి రాజువారిపల్లె వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో మార్కెండేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు.


స్కానింగ్ సెంటర్ సీజ్



స్కానింగ్ సెంటర్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

పీలేరు రూరల్ : పీలేరు పట్టణం రైల్వేగేటు సమీపంలో ఉన్న నోబుల్ నర్సింగ్ హోంలో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్న స్కానింగ్ సెంటర్‌ను సీజ్ చేసినట్లు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ జి.ఉషశ్రీ, తహసీల్దార్ భీమేశ్వర్‌రావు తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం నోబుల్ నర్సింగ్ హోమ్‌ను అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నోబుల్ నర్సింగ్‌హోమ్‌లో లింగనిర్ధారణ పరీక్షలు చేయుటకు స్కానింగ్ సెంటర్ నిర్వహిస్తున్నట్లు గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు. గతంలోనూ ఈ స్కానింగ్ సెంటర్‌ను సీజ్ చేయడం జరిగిందని, తిరిగి ఇదే కేంద్రంలో యథాప్రకారం లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందడంతో తనిఖీ చేసి సీజ్ చేసినట్లు వివరించారు. తనిఖీలో జిల్లా డెమో అధికారిణి దేవశిరోమణి, వీఆర్వోలు యర్రయ్య, కవిత, హెచ్ఈ ఉషా పాల్గొన్నారు.


వృద్ధుడి అదృశ్యం



చలపతి (ఫైల్)

కురబలకోట : చింతమాకులపల్లె సచివాలయ పరిధిలోని పుల్లగూరవాండ్లపల్లెకు చెందిన రైతు చలపతి (60) అదృశ్యమైనట్లు కుటుంబీకులు శుక్రవారం ముదివేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇతను పొలం వద్ద వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చుకోడానికి కొంత కాలంగా విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో భూ వివాదాలు ఉన్నాయన్న కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు సమీప ప్రత్యర్థులు అభ్యంతరం తెలిపారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు అధికారులు కూడా నిస్సహాయతను వ్యక్తం చేశారు. భూ వివాదాలున్నాయన్న కారణంగా రక్త సంబంధీకులు అభ్యంతరం చెప్పడం, మరో వైపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు అధికారులు ముందుకు రాకుండా పోయారు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన రైతు శుక్రవారం వేకువజాము నుంచి కన్పించకుండా ఇళ్లు వదిలి పోయినట్లు కుటుంబీకులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇతని ఆచూకీ కోసం విస్తృతంగా దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

యోగా.. అదిరిందిగా..







మదనపల్లెలోని చిత్తూరు రోడ్డులో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో రెండు రోజులుగా జాతీయ యోగా మీట్–2024 ఉత్సాహంగా జరుగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం అండర్–14, అండర్–17, అండర్–19 విభాగాల్లో బాల,బాలికలకు వేర్వేరుగా పోటీలు జరిగాయి. ఇందులో విద్యార్థులు ఎంతో క్లిష్టమైన భంగిమలతో ఆసనాలు వేశారు. అందరి చేత మనన్ననలు పొందారు. కార్యక్రమంలో నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణన్, నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ గోవిందరావు, బెంగుళూరు రూరల్ విద్యాలయ సమితి ప్రిన్సిపాల్ చక్రవర్తి, శ్రీ సత్యసాయి జిల్లా ప్రిన్సిపాల్ నాగరాజ, జగదీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. – మదనపల్లె సిటీ



నిమజ్జనానికి వెళ్లి వచ్చి గుండెపోటుతో మృతి



ప్రశాంత్ మృతదేహం

మదనపల్లె : వినాయక విగ్రహ నిమజ్జనం సందర్భంగా ఆటాపాటలతో సందడి చేసిన ఓ యువకుడు ఇంటికి వచ్చిన తర్వాత హఠాత్తుగా గుండెపోటుతో మృతి చెందిన సంఘటన మదనపల్లె మండలంలో జరిగింది. వలసపల్లె పంచాయతీ కృష్ణాపురానికి చెందిన ఆటోడ్రైవర్ ప్రశాంత్(25) మొలకలదిన్నెలో జరుగుతున్న వినాయక నిమజ్జనానికి వెళ్లాడు. వేడుకలో ఉత్సాహంగా పాల్గొన్నాడు. కేరింతలు కొడుతూ డ్యాన్స్ వేశాడు. స్నేహితులతో కలిసి రంగులు చల్లుకుని సరదాగా గడిపాడు. అనంతరం ఇంటికి వెళ్లి దుస్తులు మార్చుకుంటూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన ప్రశాంత్‌ను కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో విలపిస్తూ మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు.